క్లుప్తంగా

డీసీసీబీ సేవలతో ప్రయోజనం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్‌: డీసీసీ బ్యాంకు అందజేస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పేర్కొన్నారు. డీసీసీబీ ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం మేనేజర్ వెంకటేశం సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. క్యాలెండర్‌లో బ్యాంకు ద్వారా అందజేస్తున్న సేవలను ముద్రించడంపై ఎమ్మెల్యే అభినందించారు. జిల్లా సహకార కేంద్రం బ్యాంకు హౌసింగ్, విద్య, ఎస్ఎస్‌జీ, వ్యాపార రుణాలు సైతం తక్కువ వడ్డీకి ఇస్తుందన్నారు. డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లపై అధిక వడ్డీని అందజేస్తుందన్నారు. రైతులతోపాటు అన్ని వర్గాల వారికి బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మేనేజరు వెంకటేశం, సిబ్బంది, నాయకులు దీపక్‌రెడ్డి, నారాయణ జాదవ్ ఉన్నారు.

ప్రత్యేక పూజలు



మునిపల్లి(అందోల్): భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో శివలింగానికి పూజారి అయప్ప స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అంతారం జీవన్ముక్త సంస్థానంలో పాండు రంగ విఠలేశ్వర, రుక్మాబాయి దేవతా మూర్తులతో పాటు జీవన్ముక్త మహరాజ్‌కు సంస్థాన పీఠాధిపతి జ్ఞానేశ్వర్ మహరాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతన నియామకం



లింగబలిజ అధ్యక్ష కార్యవర్గ సభ్యులు

సదాశివపేట(సంగారెడ్డి): వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం మండల అధ్యక్షుడిగా పోలీస్ సంగన్న, గౌరవ అధ్యక్షుడిగా శంభుని దశరథ్, ప్రధాన కార్యదర్శిగా ఓన్నాపురం వీరన్న, కోశాధికారిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా చిన్నగారి శేఖర్, సలహాదారులుగా బసప్ప, చెక్రియల శేఖర్, జాయింట్ సెక్రటరీగా శ్రీశైలం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ధనుంజయ్, అధ్యక్షుడు పృథ్వీరాజ్, కోశాధికారి గోపురాజు, ఉపాధ్యక్షుడి అశోక్‌రాజ్‌పాటిల్, భారతప్ప, సలహాదారుడు రవీందర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మండల అధ్యక్ష కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తాపీమేస్త్రీల సంఘం ఏర్పాటు



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మణికంఠ తాపీమేస్త్రీల సంఘాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడిగా గోవింద్, కోశాధికారిగా నారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఎలమంద, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోటయ్య, కార్యనిర్వాణాధికారిగా లచ్చయ్య, సంయుక్త కార్యదర్శిగా నర్సింలు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను కాంగ్రెస్ నాయకుడు హుస్సేన్ శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తాపీమేస్త్రీల సమస్యల పరిష్కారానికి సంఘం కృషి చేస్తుందని నూతన కార్యవర్గ సభ్యులు ప్రతిజ్ఞ చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓ

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం అసద్‌గంజ్ ప్రభుత్వ పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ పొందిన నర్సింహారెడ్డి టీచర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జాఫర్ అలీ, నోడల్ అధికారి బస్వరాజ్ మాట్లాడుతూ.. తన సర్వీసులో నర్సింహ్మారెడ్డి అందరి మన్ననలు పొంది విద్యా ప్రమాణాలు పెంపొందించడానికి కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు దత్తాత్రి, మండల అధ్యక్షుడు మల్లయ్యస్వామి, సంఘాల నాయకులు బస్వరాజ్, గోపాల్, జగదీశ్వరయ్య, శరణప్ప, నీలకంఠయ్య, హెచ్‌ఎం. స్వర్ణకుమారి పాల్గొన్నారు.



పటాన్‌చెరు: గణనాథునికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



నారాయణఖేడ్‌: నల్లపోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పోటెత్తిన భక్తులు

నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఏడాదంతా ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో పూజారులు అభిషేకం, గణపతి హవనములు, శతచండీ హోవనములు, మహా మంగళహారతి పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



న్యాల్‌కల్ : పూజలు చేస్తున్న హరీశ్‌రావు



న్యాల్‌కల్ : యజ్ఞాలు నిర్వహిస్తున్న దంపతులు



న్యాల్‌కల్ : యజ్ఞశాలలో..



జిన్నారం (పటాన్‌చెరు): వీరభద్రుడి దర్శనానికి వేచి ఉన్న భక్తులు

సీఎంకు శుభాకాంక్షలు



సీఎం రేవంత్‌రెడ్డితో నీలం మధు

పటాన్‌చెరు: ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్ కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. సంక్షేమం, అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్, మూసీ నది ప్రక్షాళన వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపట్టి ప్రజలకు ఎంతో ఉపయోగపడేలా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పట్టణంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. యువతీ యువకులు మంగళవారం రాత్రి స్వగృహాలు, రహదారుల్లో కేక్ కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరయ్యారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు శుభాకాంక్షలు



జహీరాబాద్ టౌన్: హరీశ్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు తదితరులు

పటాన్‌చెరు టౌన్: మాజీ మంత్రి హరీశ్‌రావుకు పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్, బీఆర్‌ఎస్ శ్రేణులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జహీరాబాద్ వెళ్తున్న హరీశ్‌రావుకు ముత్తంగి రింగ్ రోడ్డు వద్ద ఘన స్వాగతం పలికి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే

మాజీ మంత్రి హరీశ్‌రావు బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.



పటాన్‌చెరు టౌన్: హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు

చేనేత కార్మికులకు చేయూతనివ్వండి

పద్మశాలి సంఘం నేతలు



భూమిపూజ చేస్తున్న నాయకులు

గజ్వేల్‌రూరల్: చేనేతరంగానికి చేయూతనిచ్చి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ పద్మశాలి సంఘం నేతలు కోరారు. పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయం వద్ద బుధవారం నేతన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేతకు ఆదరణ కరువై నేత కార్మికులు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సబ్సిడీపై రుణాలను అందించాలని, నేత వస్త్రాలను కొనుగోలు చేసి అండగా నిలవాలని కోరారు. అనంతరం సంఘం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రాజారాం, భాస్కర్, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రాజేశం, బాల్‌చంద్రం, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాలు నాశనం చేసుకోవద్దు: సీఐ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తాత్కాలిక ఆనందం కోసం జీవితాలు నాశనం చేసుకోవద్దని టూటౌన్ సీఐ ఉపేందర్ పిలుపునిచ్చారు. బుధవారం నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పిల్లలు గంజాయి ఇతర మత్తుపదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించాలన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు కలిగిఉన్నా.. విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే యాంటీ నార్కొటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నంబరు 1908కి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్‌ఐ రాజేశం, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, డాగ్ స్క్వాడ్ సిబ్బంది, టూ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



నారాయణఖేడ్‌: డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేస్తున్న పోలీసులు

నారాయణఖేడ్‌: పట్టణంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీశైలం సిబ్బందితో కలిసి మంగళవారం అర్ధరాత్రి వరకు వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ముందస్తు జాగ్రత్తగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 13మందిపై కేసులు నమోదు చేశారు. 40 మందిపై ఎంవీ యాక్ట్ కేసులను నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీశైలం వివరించారు.

98 వాహనాలు సీజ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నూతన సంవత్సర సందర్భంగా మంగళవారం రాత్రి కొల్లూరు, రామచంద్రాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు పెద్ద ఎత్తున డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. బుధవారం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పవన్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపిన 98 మందిని అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. రోడ్డుప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు.

12 నుంచి మోతీమాత జాతర ప్రారంభం



ఆలయంలో కొలువైన మోతీమాత

జహీరాబాద్ టౌన్: రాష్ట్రంలో గిరిజనుల జాతరగా ప్రసిద్ధి చెందిన మోతీమాత(మరియమ్మ) జాతర ఉత్సవాలు ఈ నెల 12 నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు కేషు సింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా మొగుడంపల్లి మండలం ఉప్పరపల్లి తండాలోని మోతీమాత జాతర ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయన్నారు. ఈ జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచే కాకుండా కర్నాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ ఉత్సవాల్లో గిరిజన మహిళలు సంప్రదాయ నృత్యాలతో ఆడిపాడుతారు. అలాగే బుధవారం నూతన ఆలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కిషన్ పవార్, అధ్యక్షుడిగా కేషుసింగ్‌రాథోడ్, ప్రధాన కార్యదర్శిగా పవన్ రాథోడ్, ఉపాధ్యక్షుడిగా జాదవ్ నారాయణ ఎన్నికయ్యారు.

పైప్ లీకేజీ.. పట్టించుకోరేం?

- రెండు నెలలుగా వృథాగాపోతున్న నీరు
- విద్యార్థులు, రోగులకు తప్పని అవస్థలు



పాఠశాల గేట్ ఎదుట నిలిచిన నీరు



పాకుడు పట్టిన ఆరోగ్య ఉప కేంద్రం ప్రాంగణం

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని వనంపల్లి గ్రామంలో రెండు నెలలుగా పైప్‌లైన్ లీకేజీ అవడం వల్ల తాగునీరు వృథాగా పోతోంది. గ్రామంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు పక్కపక్కనే ఉన్నాయి. వాటన్నింటికీ ప్రహరీ నిర్మించి గేట్‌ను ఏర్పాటు చేశారు. బోరుబావి నుంచి మిషన్ భగీరథ ట్యాంకుకు కనెక్షన్ ఇచ్చారు. అక్కడి నుంచి గ్రామానికి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మధ్యలో రెండు చోట్ల పైప్‌లైన్ లీకేజీలు అవుతుండటంతో పాఠశాల ప్రధాన గేట్ నుంచి నీరు పారుతుంది. ఫలితంగా విద్యార్థులు, చిన్నారులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారు. బండరాళ్లను నీటి మధ్యలో వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కలుషితమై వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం వాసర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ శోభరాణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మలు, విద్యుత్ లైన్ సరిచేసే పనులు చేపడుతున్నామని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైల్వేబ్రిడ్జికి బసవేశ్వరుడి పేరు పెట్టాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జికి మహాత్మా బసవేశ్వరుడి పేరు పెట్టాలని లింగాయత్ సమాజ్ నాయకులు కోరారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో జహీరాబాద్ లింగాయత్ సమాజ్ ప్రధాన కార్యదర్శి సుభాష్ మాట్లాడారు. విశ్వగురువు బసవేశ్వరుడు 800 సంవత్సరాల క్రితం జాతి వర్గ వర్ణ రహిత సమ సమాజ నిర్మాణానికి కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్తన్నారు. 12వ శతాబ్దంలోనే ఆయన కర్నాటకలోని బసవ కల్యాణ్‌లో ఇప్పటి పార్లమెంట్ తరహాలో అనుభవ మండపాన్ని స్థాపించి అణగారిన జాతులు, మహిళలకు ఉన్నత పదవులు కట్టబెట్టారన్నారు. లింగ బేధం లేకుండా అభిప్రాయాలను తెలిపే స్వేచ్ఛను కల్పించారని అన్నారు. ప్రపంచంలోనే మొదటి సారి ప్రజాపాలన వ్యవస్థ ఏర్పాటు చేసిన మహనీయుడని కొనియాడారు. జహీరాబాద్ కర్నాటక రాష్ట్రానికి ముఖద్వారంగా ఉన్న రైల్వేబ్రిడ్జికి బసవేశ్వరుడి పేరు పెట్టాలని డిమాండ్ చేశారు.

డ్రగ్స్ బారిన పడొద్దు

దుబ్బాక: యువత డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రభుత్వ ఆస్పత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువత మంచి లక్ష్యాలు ఎంచుకొని ముందుకు సాగాలని సూచించారు. డ్రగ్స్ బారిన పడి ఆర్థికంగా, మానసికంగా అవస్థలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ నూతన సంవత్సరంలో డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు యువత నడుంబిగించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

తొగుట(దుబ్బాక): మండలంలోని జప్తిలింగారెడ్డిపల్లి శ్రీసింగరాల మల్లన్న ఆలయం వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



నూతన బోరును ఏర్పాటు చేయిస్తున్న గోవర్ధన్

జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నీటి సమస్యను బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి శాశ్వతంగా పరిష్కరించారు. గుమ్మడిదల మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు కొంత కాలంగా నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో గోవర్ధన్‌రెడ్డి సొంత నిధులతో బుధవారం నూతన బోరును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ప్రశాంతమైన వాతావరణంలో విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో నీటి వసతిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు..

ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న మంగమ్మ

పటాన్‌చెరు టౌన్: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో భార్యకు తీవ్రగాయాలు కాగా, భర్తకు స్వల్ప గాయాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగికి చెందిన జానకంపేట ఎల్లయ్య పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామ పరిధిలోని కిరణా షాపు నడుపుకొంటున్నాడు. డిసెంబర్ 31 రాత్రి కిరాణా షాపు నుంచి ద్విచక్రవాహనంపై భార్య మంగమ్మతో కలిసి ముత్తంగి సాయి ప్రియకాలనీకి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో మంగమ్మకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్లపై హైటెన్షన్ వైర్లు



లక్ష్మీనగర్‌లోని ఇళ్ల మధ్య హైటెన్షన్ లైన్

భయాందోళనలో ప్రజలు

కంది (సంగారెడ్డి): జనవాసాల మధ్య ఉన్న హైటెన్షన్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇళ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోవస్తుందని ప్రజలు వాపోతున్నారు. మండలంలోని కాశిపూర్, తుంకిల్లతండా, మక్త అల్లూరు, కందిలోని లక్ష్మీనగర్ కాలనీల్లో హైటెన్షన్ లైన్ ఇళ్ల మధ్య నుంచి వెళ్లడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల ఏకంగా ఇళ్లపై నుంచే విద్యుత్ తీగలు వెళ్తుండటంతో కాలనీవాసులు ఎప్పుడు ఏం జరుగుతోందని ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడైనా ఇంటిపైకి వెళ్లినప్పుడు షాక్ గురై ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. జనవాసాల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని ఆయా కాలనీ ప్రజలు వేడుకుంటున్నారు.